మినీ బస్సును ఢీకొట్టిన డీసీఎం

- ఒకరు మృతి.. ముగ్గురికి తీవ్ర గాయాలు

కొత్తకోట, సెప్టెంబర్ 29 : ఆగి ఉన్న మినీ బస్సును డీసీఎం ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన కొత్తకోట వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకున్నది. ఎస్సై మంజునాథ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని మలక్‌పేట, చాదర్‌ఘట్‌కు చెందిన షేక్ హుస్సేన్ కర్నూల్‌లో వెళ్లి పంక్షన్‌లో వంటలు చేసేందుకు మహ్మద్ అజీమ్, సయ్యద్ ముస్తాప్ప, కూలీలు వి.రవినాయక్‌తో పాటు మరి కొందరు కలిసి మినీ బస్సును అద్దెకు తీసుకొని శనివారం రాత్రి సుమారు 10 :30 గంటలకు హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు బయలు దేరారు. వనపర్తి జిల్లా కొత్తకోట బైపాస్ రోడ్డు దాటిన తరువాత మినీ బస్సు వెనుక టైర్ పగిలి పోవడంతో బస్సు రోడ్డుపైనే ఆగిపోయింది. దీంతో మినీ బస్సు డ్రైవర్ మహ్మద్ ఉస్మాన్ బస్సు పార్కింగ్ లైట్స్ వేసి బస్సు టైర్ మార్చుతుండగా హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న డీసీఎం డ్రైవర్ అజాగ్రత్తగా అతివేగంగా వచ్చి మినీ బస్సును వెనుక నుంచి ఢీకొట్టడంతో సయ్యద్ ముస్తఫా(33) అక్కడికక్కడే మృతి చెందాడు. మహ్మద్ అజీమ్, వి.రవినాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను వనపర్తి ఏరియా దవాఖానకు తరలించారు.

పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానకు తరలించారు. కాగా డీసీఎం డ్రైవర్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. షేక్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

రెండు బైక్‌లు ఢీ

- యువకుడికి గాయాలు
- కర్నూల్ దవాఖానకు తరలింపు

గట్టు, సెప్టెంబర్ 29 : ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గొర్లఖాన్‌దొడ్డి– తప్పెట్లమొర్సు రోడ్డుపై ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్నది. ఎస్సై కేటీ మల్లేశ్ కథనం ప్రకారం కర్ణాటకలోని కురిడికి చెందిన చిన్న అనే యువకుడు బైక్‌పై భార్య గ్రామం తాటికుంటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న బైక్ ఆయన వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో చిన్న తలకు గాయమైంది. ఆయనను మెరుగైన చికిత్స కోసం కర్నూల్ దవాఖానకు తరలించారు. కాగా ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైతు కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలి

- జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య

జడ్చర్ల, సెప్టెంబర్ 29 : జడ్చర్ల మండలంచిన్న ఆదిరాల గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు ట్రాక్టర్ బోల్తాపడి విద్యుత్‌స్తంభాలు పైన పడి మృతి చెందారని వారి మృతికి ప్రభుత్వమే కారణమని, అందుకు గానూ మృతుల కుటుంబాలకు రూ.20లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ట్రాక్టర్‌బోల్తా పడిన ఘటనలో మృతిచెందిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు జడ్చర్లలోని ప్రభుత్వ దవాఖాన మార్చురీలో ఉన్న జంగయ్య మృతదేహాన్ని వారు పరిశీలించారు. అదేవిధంగా మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ ఎదులజంగయ్య, పిచ్చకుంట్ల జంగయ్య, గణేశ్‌లు విద్యుత్ కనెక్షన్ కోసం డీడీలు కట్టారని తెలిపారు. ఆదివారం స్తంభాలకోసం జడ్చర్లకు ట్రాక్టర్ తీసుకొచ్చి స్తంభాలను తీసుకొని వెళ్లే క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి ట్రాలీ బోల్తా పడడంతో ట్రాక్టర్‌ట్రాలీలో ఉన్న ఇద్దరు మృతి చెందినట్లు తెలిపారు. వీరి చావుకు కారణం ప్రభుత్వానిదేనన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.20లక్షల పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు హఫీజ్, కరాటే శ్రీను, నాగరాజు, మచ్చలశ్రీను, రవి తదితరులు ఉన్నారు.

భూత్పూర్‌లో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిరసన

భూత్పూర్, సెప్టెంబర్ 29 : తిరుపతిలో కల్తీ లడ్డూ వ్యవహారంపై వీహెచ్‌పీ ఆధ్వర్యంలో భూత్పూర్ పట్టణ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తిరుపతి హిందువుల పరమ పవిత్రమైన ఆలయం. తిరుపతి ప్రపంచ చరిత్రలో ఎంతో పవిత్ర మైనదని విశ్వహిందూ పరిషత్ నాయకులు వ్యక్తం చేశారు. అన్య మతస్తులకు తిరుపతిలోకి ప్రవేశం కల్పించకూడదని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

నిధులున్నా.. పనులు సున్నా

- అర్ధాంతరంగా నిలిచిన రోడ్డు పనులు
- మూలుగుతున్న రూ.65లక్షల ఎస్‌డీఎఫ్ నిధులు
- రోడ్డు పనులు ప్రారంభించాలంటున్న బైరంపల్లి గ్రామస్తులు

బైరంపల్లి రహదారి మధ్యలో కల్వర్టు కోసం వేసిన పైపులు

మాగనూరు, సెప్టెంబర్ 29: బైరంపల్లి నుంచి నేరేడుగం బీటీ రోడ్డు వరకు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఫార్మేషన్ రోడ్డు నిర్మాణానికి టెండర్ ద్వారా వచ్చిన పనులు అర్ధాంతరంగా ప్రారంభ దశలో ఆగిపోయాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చొరవతో గ్రామానికి రూ.65 లక్షల ఎస్‌డీఎఫ్ స్పెషల్ ఫండ్ మంజూరు చేయించారు. అయితే పనులు ప్రారంభించే దశలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. ప్రభుత్వం మారడంతో ఇక ఆ రోడ్డు సమస్య గురించి పట్టించుకునే నాథుడు కరువయ్యాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించిన మొదటి దశలోని రైతులు పనులను అడ్డుకున్నారు. కాలినడక బాటను రోడ్డుగా మారిస్తే రైతులు నష్టపోతారని పొలాలు రోడ్డులో పోయిన వారికి నష్టపరిహారంగా ఇస్తామని అధికారులు గానీ ఎమ్మెల్యేలు గానీ హామీ ఇస్తే తప్పా రోడ్డు వేయనీయమని తెగేసి చెబుతున్నారు. గ్రామానికి గతేడాది మంజూరైన రూ.65లక్షలకుగానూ ప్రారంభమై పనులు నేటికీ కొనసాగకుండా అర్ధాంతరంగా ఆగిపోయి గ్రామస్తులు ఇక్కట్లకు గురవుతున్నారు. గర్భిణులు, విద్యార్థులు నేటికీ రాకపోకలకు అవస్తలు పడుతున్నారు. గతేడాది కాంట్రాక్టర్ కల్వర్టులకు పునాదులు వేసి పైపులు తీసుకొచ్చినా.. వాటిని పునాదిపై వేయకుండా రైతులు అడ్డుకున్నారు. తెచ్చిన పైపులు సంవత్సరం గడుస్తున్నా పొలాల్లోనే మూలుగుతున్నాయి. పనులు ప్రారంభించి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

లింగాల, సెప్టెంబర్ 29 : మండలకేంద్రం సమీపంలో ధారూరం వెళ్లే రోడ్డు మార్గంలోని పొలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఆదివారం వెలుగు చూసింది. వ్యవసాయ పొలం చుట్టు పక్కల గొర్రెల కాపరులు గొర్రెలను మేపుతుండగా పొలం గెట్టుగడ్డిలో మృతదేహం ఉన్నట్లు గమనించి గ్రామస్తులకు తెలిపారు. మృతుడి వయస్సు 30–35 ఉండగా ఒంటిపై నీలపు రంగు ప్యాంటు, గళ్లు షర్టు, కుడిచేతిలో సెల్‌ఫోన్ కలిగి ఉన్నది. సమాచారం తెలుసుకున్న ఎస్సై జగన్‌మోహన్ ఘటనా స్థలాన్ని చేరుకొని మృతదేహాన్ని అచ్చంపేట మార్చురీకి తరలించారు. మృతదేహం ముఖం గుర్తుపట్టకుండా ఉండడంతో మూడురోజుల కిందట జరిగినట్లు తెలుస్తోంది. దీంతో సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడి వివరాలు తెలుసుకోవడానికి పోలీసులు ప్రయత్నం చేస్తున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బాలానగర్ (రాజాపూర్), సెప్టెంబర్ 29 : రాజాపూర్ మండల కేంద్రంలో ఆదివారం సీసీ రహదారి నిర్మాణం పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే నిధులు రూ.20లక్షలతో రహదారి నిర్మాణం పనులు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు బచ్చిరెడ్డి, కృష్ణయ్య ఉన్నారు.

దవాఖాన సిబ్బందిపై కేసు నమోదుకు ఎస్పీ ఆదేశాలు

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 29: జనరల్ దవాఖానకు ప్రాణపాయ స్థితిలో వైద్యసేవల కోసం వచ్చిన ఓ వృద్ధురాలు (మాజీ సర్పంచ్) చికిత్స పొందుతూ మృతిచెందగా.. దవాఖాన సిబ్బంది ఆమె చేతికి ఉన్న బంగారు గాజులను తస్కరించిన వ్యవహారంపై ఆదివారం నమస్తే తెలంగాణలో కథనానికి ఎస్పీ జానకి స్పందించారు. టూటౌన్ సీఐకి ఈ ఘటనపై కేసు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటన ఈనెల 14వ తేదీ చోటు చేసుకోగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతురాలి మనువడు సూర్యప్రకాశ్‌రెడ్డి కథనం ప్రకారం.. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని నిడుకుర్తి గ్రామానికి చెందిన తాజామాజీ సర్పంచ్ యశోదమ్మ (70) ఈనెల 14న ఇంట్లో ఆనారోగ్యానికి గురికాగా.. వెంటనే వైద్యసేవల నిమిత్తం మహబూబ్‌నగర్ జనరల్ దవాఖానకు కారులో తీసుకొచ్చారు. ఆమెవెంట మనువడు సూర్యప్రకాశ్‌రెడ్డి ఉండి వైద్యులను సంప్రదించగా.. వైద్యులు ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. ఈ క్రమంలో వైద్యసేవలందిస్తుండగా 25నిమిషాలలో ఆమె తీవ్ర ఆస్వస్థతకు గురై శనివారం సాయంత్రం 6:45గంటలకు మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు తీవ్ర దుఖాంతో ఉండగా.. విధుల్లో ఉన్న వైద్యసిబ్బంది ఆమె చేతికి ఉన్న బంగారు గాజులను తస్కరించి ఆమె మృతురాలిని తీసుకెళ్లేందుకు డెత్ సర్టిఫికేట్ కోసం కుటుంబ సభ్యులు తిరుగుతుండగా.. అక్కడ సిబ్బంది శవంపై ఉన్న బంగారం తీసుకొని తమ చేతి వాటం ప్రదర్శించారు. మృతురాలిని తరలిస్తుండగానే ఆమె చేతికి బంగారం గాజులు కనిపించకపోవడంతో విధుల్లో ఉన్న వైద్యసిబ్బందిని అడిగారు. అయినా తమకు తెలియదని చెప్పారు. పైవిషయంపై దవాఖానకు చెందిన పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు. ఆర్ఎంవోకు బంగారం గాజులు పోయిన విషయం తెలిపి అక్కడ ఫిర్యాదు చేసి వెళ్లారు. టూటౌన్ పోలీసుస్టేషన్‌లో కూడా అదేరోజు సూర్యప్రకాశ్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసి రెండు వారాలైన కూడా పోలీసులు కేసుపై సమగ్ర విచారణ చేయడంలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఘటనపై టూటౌన్ సీఐ ఎజాజ్ అహ్మద్‌ను వివరణ కోరగా.. ఆదివారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నమస్తే ఎఫెక్ట్

క్రీడలతోనే ఆరోగ్యం: ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి

మక్తల్, సెప్టెంబర్ 29: క్రీడలతో ఆరోగ్యంగా ఉండడంతోపాటు శారీరక దారుఢ్యం పెరుగుతుందని.. ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణిస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఆదివారం మక్తల్ మినీ స్టేడియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి షూటింగ్ బాల్ జట్టు ఎంపిక కార్యక్రమానికి ఎస్సై ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మక్తల్ ప్రాంతానికి చెందిన క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడంలో రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు గోపాలం ఎంతో పేరుగాంచారని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత కూడా క్రీడాకారులకు శిక్షణ ఇస్తూ మండలస్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేస్తున్నందుకు గోపాలంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోపాలం మాట్లాడుతూ.. జిల్లాస్థాయి షూటింగ్ బాల్ ఎంపికకు జిల్లా నలుమూలల నుంచి 200మంది బాలబాలికలు హాజరయ్యారని, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన బాలబాలికలను ఎంపిక చేసి అక్టోబర్ 3నుంచి 5వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కొండయ్య, రఘుప్రసన్న భట్, శరణప్ప, పీడీలు విష్ణువర్ధన్‌రెడ్డి, రాఘవేందర్, రమేశ్‌కుమార్, వాణి, పుష్ప, దీప, శ్రీలత, అనిత, రమేశ్‌కుమార్, దామోదర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు అవకాశం కల్పించాలి

కృష్ణ, సెప్టెంబర్ 29 : కర్ణాటకలో తెలంగాణ విద్యార్థుల ఉన్నత విద్యకు అవకాశం కల్పించాలని ఎంఈవో నిజాముద్దీన్ కర్ణాటక చిన్ననీటిపారుదల, శాస్త్రసాంకేతిక మంత్రి ఎన్ఎస్ బోసురాజుకు గడినాడు సంఘం ప్రధాన కార్యదర్శి నాగభూషన్‌తో కలిసి ఆదివారం వినతిపత్రం అందజేశారు. కృష్ణ మండల పరిసర ప్రాంతాల్లో కన్నడ మీడియంలో చదువుతున్న విద్యార్థులు కర్ణాటకలో ఉన్నత విద్య చదువుకోవడానికి, హాస్టల్‌లో ప్రవేశం పొందడానికి తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన కులం, ఆదాయ ధ్రువపత్రాలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కన్నడ మీడియం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్‌ను ధ్వంసం చేసిన దుండగులు

మక్తల్, సెప్టెంబర్ 29: మండలంలోని భూత్పూర్‌లో పైప్‌లైన్‌ను ధ్వంసం చేసిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారం ప్రకారం మండలంలోని భూత్పూర్‌లోని ఆంజనేయ స్వామి, శివాలయాలకు మిషన్ భగీరథ నీటి సరఫరాకు పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయానికి సమీపంలో పైప్‌లైన్‌ను దుండగులు ధ్వంసం చేయడంతో నీరంతా వృథాగా పారుతూ పంట పొలాల్లోకి వెళ్తున్నది. ఆలయాలకు వేసిన పైప్‌లైన్‌ను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

పీఏసీసీఎస్‌కు అప్పగించాలి

ధన్వాడ, సెప్టెంబర్ 29: మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన ధాన్యం కొనుగోలను ధన్వాడ సింగిల్ విండోకు అప్పగించాలని మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రామచంద్రయ్య, లక్ష్మయ్యగౌడ్, రాజ్యనాయక్ ఆదివారం ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోలను మహిళా సంఘాలకు అప్పగించడంతో ధాన్యం కొనుగోలు జాప్యమైందని.. అందువల్ల ఈ ఏడాది మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు బాధ్యతలు అప్పగించకుండా సింగిల్ విండోకు అప్పగించాలని వారు కోరారు.

రాబడి

చిన్న పెట్టుబడి.. పెద్ద రాబడి

మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌లో ఇన్వెస్ట్ చేస్తారా?

త్వరపడండి.. మరో 6 నెలలే సమయం

మీ రిటైర్మెంట్ అనంతరం ఆనందకర జీవితాన్ని సొంతం చేసుకోవడానికున్న చక్కని ఆర్థిక సాధనాల్లో నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) ఒకటి. అయితే ఇందులో తగిన యాన్యుటీ ప్లాన్‌ను ఎంచుకొనే బాధ్యత మాత్రం పెన్షనర్‌దే. ఎన్‌పీఎస్ 2024 హ్యాండ్‌బుక్ వివరాల ప్రకారం 2004 జనవరి 1న ఈ స్కీం ప్రారంభమైన దగ్గర్నుంచి పదవీ విరమణ సమయం లోనే 1,65,320 మంది యాన్యుటీ ప్లాన్లను ఎంచుకున్నట్లు తేలింది.

ఎన్‌పీఎస్‌లో సరైన ప్లాన్?

ప్రస్తుతం ఎన్‌పీఎస్ సబ్‌స్క్రైబర్ల కోసం 15 రకాల యాన్యుటీ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే ఎల్ఐసీ, ఎస్బీఐ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్, కొటక్ మహీంద్రా లైఫ్, మ్యాక్స్ లైఫ్, బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్, శ్రీరామ్ లైఫ్, టాటా ఏఐఏ లైఫ్, ఆదిత్యా బిర్లా సన్ లైఫ్ తదితర 15 జీవిత బీమా సంస్థలు యాన్యుటీ సర్వీస్ ప్రొవైడర్లుగా పనిచేస్తున్నాయి. యాన్యుటీ రేట్లు, ఆప్షన్స్‌నుబట్టి ఈ ప్లాన్లు మారుతూ ఉంటాయి. ప్రస్తుతమున్న యాన్యుటీ ప్లాన్లలో ఐదు రకాలే పాపులర్. వాటిలో యాన్యుటీ ఫర్ లైఫ్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, జాయింట్ లైఫ్ యాన్యుటీ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, ఎన్‌పీఎస్–ఫ్యామిలీ ఇన్‌కమ్ ఆప్షన్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, యాన్యుటీ ఫర్ లైఫ్ విత్‌ఔట్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, జాయింట్ లైఫ్ యాన్యుటీ విత్‌ఔట్ రిటర్న్ పర్చేజ్ ప్రైస్.

ఎంచుకోండిలా..

యాన్యుటీ ఫర్ లైఫ్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్‌లో సబ్‌స్క్రైబర్‌కు జీవితాంతం యాన్యుటీ వస్తుంది. ఒకవేళ చనిపోతే ఇది ఆగుతుంది. నామినీకి ప్లాన్ కొన్న ధరలో 100 శాతం తిరిగొస్తుంది.

జాయింట్ లైఫ్ యాన్యుటీ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్‌లో సబ్‌స్క్రైబర్‌కు జీవితాంతం యాన్యుటీ వస్తుంది. ఒకవేళ చనిపోతే వారి భాగస్వామికి వస్తుంది. వీరూ చనిపోతే నామినీకి ప్లాన్ కొన్న ధర మొత్తం తిరిగొస్తుంది.

ఎన్‌పీఎస్–ఫ్యామిలీ ఇన్‌కమ్ ఆప్షన్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్‌లో సబ్‌స్క్రైబర్‌కు, వారు చనిపోతే వారి భాగస్వామికి, వీరూ చనిపోతే సబ్‌స్క్రైబర్ మీద ఆధారపడ్డ తల్లిదండ్రులకు యాన్యుటీ చెల్లింపులు జరుగుతాయి. వీరి తదనంతరం సబ్‌స్క్రైబర్ పిల్లలు లేదా లీగల్ వారసులకు ప్లాన్ కొన్న ధరను మొత్తంగా చెల్లించడం జరుగుతుంది.

యాన్యుటీ ఫర్ లైఫ్ విత్‌ఔట్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్‌లో సబ్‌స్క్రైబర్ జీవించి ఉన్నంత వరకే యాన్యుటీ వస్తుంది. చనిపోతే భాగస్వామికి, నామినీలకూ రాదు.

జాయింట్ లైఫ్ యాన్యుటీ విత్‌ఔట్ రిటర్న్ పర్చేజ్ ప్రైస్‌లో సబ్‌స్క్రైబర్, వారి భాగస్వామి జీవించి ఉన్నంతదాకా యాన్యుటీ వస్తుంది. వీరు చనిపోతే నామినీలకు ఏమీ రాదు. వీటన్నింటిలో మనకు ఏది ఉత్తమం అనుకుంటే దాన్ని ఎంచుకోవడం లాభదాయకం.

ఇవి గుర్తుంచుకోండి..

యాన్యుటీని కొనేముందు మన భవిష్యత్తు ఆర్థిక అవసరాలు ఏమిటన్నదానిపై అవగాహన ఉండాలి.

అందుబాటులో ఉన్న యాన్యుటీ, పేఔట్ ఆప్షన్లు, నిబంధనలు, యాన్యుటీ కాంట్రాక్ట్ షరతులనూ తెలుసుకోవాలి.

వయసు, కొనే ధరనుబట్టి యాన్యుటీ రేట్లు ఆధారపడి ఉంటాయి.

నెల, త్రైమాసిక, అర్ధ వార్షిక, వార్షికవారీ చెల్లింపులను ఎంచుకోవచ్చు.

పెన్షనర్ మరణానంతరం భాగస్వామికి కూడా పెన్షన్ వచ్చే ప్లాన్‌ను ఎంచుకుంటే పెన్షన్ తక్కువగా వస్తుంది.

కొన్న ధరను తిరిగి చెల్లించనక్కర్లేని ప్లాన్‌ను ఎంచుకుంటే పెన్షన్ ఎక్కువగా వస్తుంది.

ఒక్కసారి యాన్యుటీ ఆప్షన్‌ను ఎంచుకొంటే ఇక మారదు. కాబట్టి ఎంచుకొనేటప్పడే అన్నిచూసుకొని నిర్ణయం తీసుకోవాలి.

మీరు ఒక మహిళ అయితే, నమ్మకమైన రిటర్నులతో సురక్షిత పెట్టుబడిని కోరుకుంటున్నట్లైతే.. మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎంఎస్ఎస్‌సీ)ను తీసుకోవచ్చు. కనీస పెట్టుబడి రూ.1,000 నుంచి మొదలవుతుంది. వడ్డీరేటు కూడా 7.5 శాతంగా ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న చాలా ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీలు) లేదా పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్స్ (పీపీఎఫ్)లపై పొందే వడ్డీలకన్నా ఇది ఎక్కువే. అంతేగాక తమ ఆడబిడ్డల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు లేదా సంరక్షకులకున్న అత్యుత్తమ పెట్టుబడి సాధనంగానూ దీన్ని పేర్కొనవచ్చు. దీనికి రెండేండ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. దీంతో చదువు కోసం పొదుపు, చిరు వ్యాపారాల చక్కగా ఉపయోగపడుతుందనే చెప్పాలి.

ఏమిటి ఈ పథకం?

మహిళా సాధికారతే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. మహిళలు, ఆడపిల్లల అవసరాలకు పొదుపును ప్రోత్సహించడంలో భాగంగా 2023 ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం ఈ స్కీంను ప్రారంభించింది. ఇందులో సురక్షిత, అధిక రాబడిగల పెట్టుబడులకు అవకాశాలుంటాయి. అయితే ఈ స్కీం పరిమిత కాలమే అందుబాటులో ఉంటుంది. వచ్చే ఏడాది మార్చిదాకే లభిస్తుంది.

ప్రధాన ఫీచర్లు..

వార్షిక వడ్డీరేటు: 7.5 శాతం. ప్రతీ మూడు నెలలకోసారి లెక్కించి జమ చేస్తారు.

అర్హత: మహిళలు, ఆడపిల్లలకు మాత్రమే ఈ స్కీంలో పెట్టుబడికి వీలుంటుంది. మైనర్ల కోసం తల్లిదండ్రులు, వారి సంరక్షకులూ ఈ పథకాన్ని తీసుకోవచ్చు.

కాలపరిమితి: రెండేండ్లు. స్వల్పకాలిక లక్ష్యాలకు ఇది చక్కని సాధనం.

పెట్టుబడి: కనిష్ఠం రూ.1,000. గరిష్ఠం రూ.2 లక్షలు. ఒకేసారి డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

ఏమిటి దీని ప్రత్యేకత?

- ఈ పథకంలో పెట్టుబడులపై ఏటా గరిష్ఠంగా 7.5 శాతం వడ్డీరేటును పొందవచ్చు. సేవింగ్స్ అకౌంట్స్, ఎఫ్‌డీలు, పీపీఎఫ్‌లతో పొందే వడ్డీరేటు కంటే ఇది ఎక్కువ. పీపీఎఫ్‌లో కూడా 7.1 శాతం వడ్డీరేటే వస్తున్నది. మహిళా సాధికారత దృష్ట్యానే ఈ స్కీంకు అన్నింటి కంటే ఎక్కువ వడ్డీరేటును ఆఫర్ చేస్తున్నారు.
- పెట్టుబడి మొదలైన ఏడాది తర్వాత అందులో 40 శాతం వరకు తిరిగి వెనక్కి తీసుకునే వెసులుబాటు ఈ పథకంలో ఉన్నది. అత్యవసర సమయాల్లో ఈ సౌమ్యును వాడుకోవచ్చు. అలాగే ఇది కేంద్ర ప్రభుత్వ పథకం. కాబట్టి అత్యంత సురక్షితమైన పెట్టుబడిగా దీన్ని పేర్కొనవచ్చు. నిర్భయంగా మహిళలు తమ కష్టార్జితాన్ని ఇందులో మదుపు చేయవచ్చు.

ఎలా పెట్టుబడి పెట్టాలి?

పోస్టాఫీస్ లేదా ప్రభుత్వ రంగ బ్యాంకులో ఖాతా ద్వారా మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌లో పెట్టుబడులకు దిగవచ్చు. పోస్టాఫీసుల్లోనైతే దగ్గర్లోని పోస్టాఫీస్‌కు వెళ్లి అక్కడ ధరఖాస్తు ఫారంను నింపాలి. మీ వ్యక్తిగత వివరాలు, పెట్టుబడి మొత్తంతోపాటు ఆధార్, పాన్, చిరునామా తదితర అవసరమైన ఇతర కేవైసీ డాక్యుమెంట్లను సమర్పించాలి. పెట్టుబడి మొత్తాన్ని నగదుగానైనా చెక్కు రూపంలోనైనా ఇవ్వవచ్చు. దీంతో ఎంఎస్ఎస్‌సీని అందుకోవచ్చు.

బ్యాంకుల్లోనైతే మీకు దగ్గర్లోని ప్రభుత్వ బ్యాంకుల శాఖలకు వెళ్లి అప్లికేషన్ ఫారాన్ని నింపి, కేవైసీ డాక్యుమెంట్ల జీరాక్స్‌లను సమర్పించాలి. నగదు, చెక్కు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ ద్వారా పెట్టుబడులు పెట్టవచ్చు. ప్రాసెసింగ్ అనంతరం సర్టిఫికెట్ మీ చేతికి వస్తుంది. కాగా, పెట్టుబడి పెట్టిన 6 నెలల తర్వాత మీ ఖాతాను మీరు ముగించవచ్చు. కానీ వడ్డీరేటు 5.5 శాతమే వర్తిస్తుంది. రూ.2 లక్షలు పెట్టుబడిగా పెడితే రెండేండ్ల తర్వాత రూ.2,32,044 వస్తుంది.

డిపాజిట్	వడ్డీ ఆదాయం	చివరకు వచ్చే మొత్తం
₹ 1,000	₹ 160	₹ 1,160
₹ 2,000	₹ 320	₹ 2,320
₹ 3,000	₹ 481	₹ 3,481
₹ 5,000	₹ 801	₹ 5,801
₹ 10,000	₹ 1,602	₹ 11,602
₹ 20,000	₹ 3,204	₹ 23,204
₹ 30,000	₹ 4,807	₹ 34,807
₹ 50,000	₹ 8,011	₹ 58,011
₹ 1,00,000	₹ 16,022	₹ 1,16,022
₹ 1,50,000	₹ 24,033	₹ 1,74,033
₹ 2,00,000	₹ 32,044	₹ 2,32,044

చదువు కోసం మదుపు..

నేడు పిల్లల విద్య కోసం చేస్తున్న ఖర్చుల భారం అంతా ఇంతా కాదు. తల్లిదండ్రులకు ఇదో పెద్ద సమస్యలా తయారైంది. అయితే సరైన ప్రణాళికతో పెట్టుబడులు పెడుతూపోతే దీన్ని అధిగమించవచ్చు. దీనికున్న అవకాశాలను పరిశీలిస్తే..

ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లు

పిల్లల ఉన్నత విద్య వంటి దీర్ఘకాల లక్ష్యాల సాధనకు ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ చక్కని మార్గం. సిప్ ద్వారా మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టే పెట్ట